

పదేళ్లయినా..

వసతి గృహం లేక విద్యార్థులు సుదూర ప్రాంతాల నుంచి కళాశాలకు చేరుకోవడానికి నరకయాతన అనుభవిస్తున్నారు. 8లో▸



పనులు పూర్తి చేయండి

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. 9లో▸



ఆటల్లో రాణించాలి

విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

అనంతుడి సేవలో జెడ్పీ చైర్‌పర్సన్



అనంతగిరి: వికారాబాద్ పట్టణ సమీపంలోని అనంతగిరిగుట్టపై వెలిసిన అనంతపద్మనాభ స్వామిని ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట ఎంపీపీ చంద్రకళ, మాజీ జెడ్పీటీసీ షరీఫ్, స్థానిక నాయకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కారుదే విజయం



కొడంగల్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ బూత్

కొడంగల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డి విజయం సాధించారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ పోలింగ్ బూత్‌లో అధికారులు ఓట్లను లెక్కించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డికి 762 ఓట్లు, జీవన్‌రెడ్డికి 653 ఓట్లు వచ్చాయి. మొదటి ప్రాధాన్యత క్రమంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి 53 ఓట్లు అధిక్యత సాధించారు. మొత్తానికి 109 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థిపై.. బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. కాగా కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో 56 మంది ప్రజాప్రతినిధులు ఈ ఎన్నికలో ఓటు వేశారు.

రేగడిమైలారంలో సంబురాలు..

బొంరాస్‌పేట: మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిచిన సందర్భంగా మండల పరిధిలోని రేగడిమైలారంలో ఆ పార్టీ నేతలు సంబురాలు చేసుకున్నారు. జై బీఆర్‌ఎస్, జై తెలంగాణ నినాదాలు చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు.. శ్యామలయ్యగౌడ్, గోవింద్‌రెడ్డి తదితరులున్నారు.

సేవలకు వందనం



పతకాలు సాధించిన పోలీసు అధికారులతో ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా సోమవారం వికారాబాద్ జిల్లా నుంచి రాష్ట్ర సేవాపతకం, అతి ఉత్కృష్ట సేవా పతకం, ఉత్కృష్ట సేవా పతకం సాధించిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కోటిరెడ్డి సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర సేవా పతకం సాధించిన వారిలో పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల, నర్సింహులు, ఏఎస్‌ఐ (బషీరాబాద్), ఆనంద్ కుమార్ ఏఎస్‌ఐ (తాండూర్), ఎండీ ఖాజాఖాన్ హెచ్‌సీ (బొంరాస్‌పేట), సత్యశీల రెడ్డి ఏఎస్‌ఐ (కుల్కచర్ల), నర్సింహులు ఏఆర్ ఎస్‌ఐ (డీఏఆర్), మురళీధర్ ఏఎస్‌ఐ(ధారూర్), రమేష్ (పెద్దేముల్), అనంతయ్య హెచ్‌సీ (డీఏఆర్), పవన్‌కుమార్ హెచ్‌సీ(కరణ్‌కోట), కేశవులు హెచ్‌సీ (ఐటీసీటీ), వేణుగోపాల్, పీసీ (వికారాబాద్) ఉండగా ధారూర్‌లో విధులు నిర్వహించే హెడ్‌కానిస్టేబుల్ రెడ్యానాయక్‌కు అతి ఉత్కృష్ట సేవా పతకం, చంగోముల పీఎస్‌లో పనిచేసే కానిస్టేబుల్ కృష్ణ ఉత్కృష్ట సేవా పతకం సాధించారు.

నకిలీ విత్తనాల విక్రయిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

అనంతగిరి: నకిలీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సీజన్‌లో జిల్లాలో 2లక్షల43 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు అయ్యే అవకాశముందని, జిల్లాలో 540 ఫర్టిలైజర్ షాపులు ఉన్నాయని.. అన్ని షాపుల్లో స్టాక్ ఏర్పాటు చేశామన్నారు. విత్తనాలు, ఎరువులకు ఎలాంటి కొరత లేదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు ఏవైనా సందేహాలుంటే సంబంధిత వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించి విత్తనాలు, ఎరువులు విక్రయించేవారిపై పీడీ యాక్టు కూడా నమోదు చేసే అవకాశం ఉందన్నారు. డీలర్లందరూ విత్తన చట్టానికి లోబడి విక్రయాలు చేపట్టాలన్నారు.



అనంతగిరి: జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ



అనంతగిరి: కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో చిన్నారుల నృత్య ప్రదర్శన

అంబరాన్నంటిన సంబురం

ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

- కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన కలెక్టర్ నారాయణరెడ్డి
- జిల్లాను అగ్రగామిగా నిలుపుదామని పిలుపు
- వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు



వికారాబాద్: వేడుకలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, అధికారులు



వికారాబాద్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

వికారాబాద్: అందరి సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుదామని కలెక్టర్ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన.. ఎస్పీ కోటిరెడ్డి, అడిషనల్ కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్‌తో కలిసి పాల్గొన్నారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అమరులు, ఉద్యమకారుల ఆకాంక్షలకు అద్దంపట్టేలా మన తెలంగాణ తీర్చిదిద్దబడుతుందని తెలిపారు. 1969లో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమం యొక్క ఆకాంక్ష .. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత 2014 జూన్ 2న నెరవేరిందని కలెక్టర్ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం విభిన్న సంస్కృతులు, విభిన్న భాషల నిలయం అయినప్పటికీ సామరస్యంగా జీవిస్తుండటం గొప్ప విషయమన్నారు. అదే మన తెలంగాణ రాష్ట్ర ఔన్నత్యం అని అన్నారు. జిల్లాలో 946 ప్రభుత్వ బడులను అమ్మ.. ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేశామని కలెక్టర్ తెలిపారు. ఆయా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు వేయటం కూడా పూర్తయ్యిందని, రూ.46కోట్ల నిధులతో వాటిలో మౌలిక సదుపాయలు కల్పించనున్నామన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే జూన్ 12వ తేదీనే విద్యార్థులందరికీ ఉచిత యూనిఫాంలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేరోజు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు సైతం అందజేస్తామని తెలిపారు. అందరి సహకారంతో ఉపాధి హామీలో జిల్లాను ముందు వరుసలో నిలిపామన్నారు. అంతకుముందు ఆయన జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, కళాకారులు నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. ప్రతిభ చాటిన వారికి కలెక్టర్ మెమొంటోలు అందజేశారు. ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులను ఈ సందర్భంగా మోమెంటోలతో కలెక్టర్ సన్మానించారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వికారాబాద్ పట్టణంలో..

అనంతగిరి: వికారాబాద్ పట్టణంతో ఆపటు మండలంలోని ఆయా గ్రామాల్లో రాష్ట్ర ఆవిర్భావ సంబురాలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, ప్రధాన చౌరస్తాల్లో, ఆయా సంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెడ్పీ కార్యాలయంపై జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించగా, వికారాబాద్ కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ కార్యాలయంపై ఎస్పీ కోటిరెడ్డి, జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదుట లైబ్రరీ ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వాసుచంద్ర, విద్యుత్ కార్యాలయం వద్ద ఎస్‌ఈ జయరాజ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. వీరితో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆయా పార్టీ కార్యాలయాల ముందు అధ్యక్షులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మంజు జెండాను ఆవిష్కరించారు.

అమరులకు నివాళి..

కాగా వికారాబాద్‌లోని అమరవీరుల స్థూపం వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రదపటేల్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు నివాళి అర్పించారు.

వార్డు సభ్యుడి నుంచి ఎమ్మెల్సీగా..

- నవీన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం
- మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఘన విజయం
- నందిగామ మండలం మొదళ్లగూడ స్వగ్రామం
- నవీన్‌రెడ్డి గెలుపుతో బీఆర్‌ఎస్‌లో నూతన ఉత్సాహం



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

షాద్‌నగర్: వార్డు సభ్యుడిగా ప్రస్థానం ప్రారంభించాడు.. రాజకీయ ప్రావీణ్యతకు పదును పెట్టాడు.. యువనేతగా మొదలై జన నేతగా ఎదిగి అనతి కాలంలోనే ఎమ్మెల్సీ పీఠాన్ని అధిరోహించాడు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఘన విజయం అందుకున్నాడు నాగర్‌కుంట నవీన్‌రెడ్డి. షాద్‌నగర్ నియోజకవర్గం నందిగామ మండలం మొదళ్లగూడ గ్రామానికి చెందిన నాగర్‌కుంట శోభారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి దంపతుల రెండో కుమారుడైన నవీన్‌రెడ్డి చిన్ననాటి నుంచి రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్నాడు. 2006లో రాజకీయ అరంగ్రేటం చేసి అప్పట్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వార్డు సభ్యుడిగా పోటీ చేసి గెలుపుతోపాటు ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2014లో కాంగ్రెస్ పార్టీ తరఫున కొత్తూరు జెడ్పీటీసీగా విజయం సాధించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జెడ్పీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవికి కసిరెడ్డి నారాయణరెడ్డి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ నుంచి కల్వకుర్తి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. దీంతో ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికల సంఘం అధికారులు ఎన్నికలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ తరఫున ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు నవీన్‌రెడ్డి పేరును ప్రకటించడంతో ఆయన బరిలోకి దిగారు. ఎమ్మెల్సీ స్థానానికి మార్చి 28న ఉప ఎన్నిక జరిగింది.

111 ఓట్ల మెజార్టీతో ఘన విజయం

ఎమ్మెల్సీ బరిలో బీఆర్‌ఎస్ నుంచి నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌గౌడ్ బరిలో దిగారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరిగింది. ఈ ఎన్నికల్లో మొత్తం 1,437 ఓట్లు పోలవగా అందులో 21 చెల్లనవిగా అధికారులు గుర్తించారు. మిగిలిన 1,416 ఓట్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌రెడ్డికి 762 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డికి 653 ఓట్లు పోలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్‌కు ఒక ఓటు మాత్రమే పోలైంది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో విజయం సాధించేందుకు 709 ఓట్లు రావాల్సి ఉండగా నవీన్‌రెడ్డికి కోటా కన్న 53 ఓట్లు అధికంగా వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారులు నవీన్‌రెడ్డి విజయం సాధించినట్లు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో నవీన్‌రెడ్డి విజయం సాధించి కాంగ్రెస్ పార్టీకి ఝలక్ ఇచ్చారు.

నవీన్‌రెడ్డిని అభినందించిన కేసీఆర్

ఎమ్మెల్సీగా విజయం సాధించిన నాగర్‌కుంట నవీన్‌రెడ్డి ఆదివారం సాయంత్రం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డికి కేసీఆర్ శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మాజీ మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తదితరులు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీగా నవీన్‌రెడ్డి విజయం సాధించడంతో బీఆర్‌ఎస్ నేతల్లో కొత్త ఉత్సహం నెలకొంది.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

- కౌంటింగ్ కేంద్రం చుట్టూ కట్టుదిట్టమైన భద్రత
- సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తి
- పోస్టల్ బ్యాలెట్‌తో పాటే ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు
- 'సాక్షి'తో చేవెళ్ల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కట్టుదిట్టమైన భద్రత మధ్య అత్యంత పకడ్బందీగా చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని, ఇందుకోసం ఇప్పటికే అన్ని చర్యలు చేపట్టామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ మూడంచెల పోలీసు భద్రత ఉంటుందని, సీసీ కెమెరాల నిఘా మధ్య అభ్యర్థులతో పాటు ఆయా పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు కొనసాగుతుందన్నారు. లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఏదైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే మినహా, మధ్యాహ్నం మూడు గంటల వరకు తుది ఫలితం వెలువడే అవకాశం లేకపోలేదని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను లెక్కింపు కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. అందరూ నిబంధనలు పాటించాలన్నారు.

బండారి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో..

చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని బండారి శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగనుంది. మహేశ్వరం నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని బ్లాక్ బిలోని 1వ అంతస్తులో, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు బ్లాక్ ఎలోని 2వ అంతస్తులో, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఓట్ల లెక్కిపు బ్లాక్ బిలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో, చేవెళ్ల నియోజకవర్గం ఓట్ల లెక్కింపు బ్లాక్ ఎలోని 1వ అంతస్తులో, పరిగి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు బ్లాక్ బిలోని 2వ అంతస్తులో, వికారాబాద్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు బ్లాక్ బిలోని 2వ అంతస్తులో, తాండూరు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు బ్లాక్ బిలోని 3వ అంతస్తులో కొనసాగుతుంది. అదే విధంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ బ్లాక్ ఎలోని 1వ అంతస్తులో కొనసాగుతుంది.

లెక్కింపు కార్యక్రమంలో 777 మంది సిబ్బంది

ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో మొత్తం 777 మంది సిబ్బంది పాల్గొననున్నారు. కౌంటింగ్ సిబ్బంది కోసం రాజేంద్రనగర్ నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాం. వీరిలో కౌంటింగ్ సూపర్‌వైజర్స్ 227 మంది ఉండగా, కౌంటింగ్ అసిస్టెంట్స్ 273, మైక్రో అబ్జర్వర్లు 277 మంది ఉన్నారు. ఇప్పటికే వీరికి శిక్షణ కూడా ఇచ్చారు. వీరంతా జూన్ 4న ఉదయం ఆరు గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోనున్నారు. లెక్కింపు సిబ్బంది తుది ర్యాండమైజేషన్ ప్రక్రియ కూడా అక్కడే కొనసాగుతుంది. ఆయా పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ (19,290) ఓట్లు లెక్కించనున్నారు. ఇందుకోసం 25 టేబుళ్లు ఏర్పాటు చేశాం. రెండు రౌండ్లలో ఈ ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. పోస్టల్ బ్యాలెట్‌తో పాటే ఈవీఎంలలో నమోదైన ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది.

శేరిలింగంపల్లిలో అత్యధికంగా 23 రౌండ్లు

చేవెళ్ల లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, వీటి పరిధిలో మొత్తం 29,38,370 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 16,57,107 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 56.40 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యధికంగా చేవెళ్లలో 71.83 శాతం నమోదు కాగా, 70.44 శాతం, తాండూరులో 67.33 శాతం, పరిగిలో 67.01 శాతం, రాజేంద్రనగర్‌లో 54.12 శాతం , మహేశ్వరంలో 52.71 శాతం, శేరిలింగంపల్లిలో అతి తక్కువగా 43.91 శాతం ఓటింగ్ మాత్రమే నమోదైంది. ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 165 టేబుళ్లు ఏర్పాటు చేశాం. అత్యధికంగా శేరిలింగంపల్లిలో 23 రౌండ్లు, చేవెళ్ల, పరిగి 22 రౌండ్లు, మహేశ్వరం, రాజేంద్రనగర్ 20 రౌండ్ల చొప్పున ఓట్లను లెక్కింపు ఉంటుంది. వికారాబాద్ 21 రౌండ్లు, తాండూరు 20 రౌండ్ల చొప్పున లెక్కింపు జరుగుతుంది.

ఫర్నీచర్ దుకాణంలో అగ్ని ప్రమాదం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని పరమేశ్వర థియేటర్ పక్కన ఉన్న జేపీ ఫర్నీచర్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. దుకాణం కింద ఉన్న సెల్లార్‌లో యజమాని ఫర్నీచర్ నిల్వ చేశాడు. ఆదివారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్ కారణంగా దుకాణంలో ఉన్న రూ.ఐదు లక్షల విలువ చేసే ఫర్నీచర్ దగ్ధమైంది. దుకాణం యజమానికి రహీం ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దుకాణ యజమానికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి

కృత్రిమ కొరత సృష్టించొద్దు

చేవెళ్ల: ఎరువులు, విత్తనాలను కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి హెచ్చరించారు. ఆదివారం స్థానికంగా రైతు వేదికలో డీలర్లు, రైతులతో విత్తనాలు, ఎరువులు, పురుగుమందు అమ్మకాలు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్యాకింగ్ చేయకుండా లూస్ విత్తనాలు విక్రయించొద్దని సూచించారు. అనుమతి పొందిన కంపెనీల విత్తనాలు మాత్రమే విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్టు కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లయితే రైతులు వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి తులసి, ఏఈవోలు రమేష్, స్వాతిప్రియ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెద్దేముల్‌: మండలంలోని జనగాం గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఆదివారం బ్రహ్మంగారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు, భజన మండలి భక్తులు స్వామి వారి అభిషేక కార్యక్రమంలో పాల్గొని పల్లకీలో ఊరేగించారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. జనగాంతో పాటు పలు గ్రామాల భక్తులు కూడా పాల్గొన్నారు.

సిమెంట్‌ ట్యాంకర్‌ బోల్తా

తాండూరు రూరల్‌: ప్రమాదవశాత్తు ఓ సిమెంట్‌ ట్యాంకర్‌ బోల్తాపడిన ఘటన మండల పరిధిలోని అల్లాపూర్‌ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తాండూరు పట్టణం నుంచి ఖాళీ సిమెంట్‌ ట్యాంకర్‌ మల్కాపూర్‌లోని సిమెంట్‌ ఫ్యాక్టరీకి సిమెంట్‌ కోసం వెళ్తుంది. అల్లాపూర్‌ వద్ద హైవే రోడ్డు పనులు జరుగుతున్నాయి. ట్యాంకర్‌ డ్రైవర్‌ అజాగ్రత్తగా నడపడంతో ఒక్కసారిగా ట్యాంకర్‌ బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. జేసీబీ సహాయంతో ట్యాంకర్‌ను పైకి లేపారు.

ఉరేసుకొని కార్మికుడి బలవన్మరణం



రాజు (ఫైల్‌)

తాండూరు రూరల్‌: కుటుంబ కలహాలతో ఓ కార్మికుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన కరన్‌కోట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని గౌతపూర్‌ శివారులోని బసవేశ్వర్‌నగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. గౌతపూర్‌ శివారులోని బసవేశ్వర్‌నగర్‌లో వడ్డె రాజు(30) మారుతి పాలిషింగ్‌ యూనిట్‌లో కార్మికుడిగా పని చేస్తున్నారు. అక్కడే ఓ అద్దెగదిలో భార్యాభర్తలు ఉంటున్నారు. గత కొన్ని రోజులుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన రాజు మద్యం మత్తులో పాలిషింగ్‌ యూనిట్‌ వద్ద ఉన్న అద్దెగదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. గమనించిన స్థానికులు వెంటనే తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని యాచకుడి మృతి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని తుంకిమెట్ల సమీపంలో ఓ గుర్తు తెలియని యాచకుడు ఆదివారం మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ ఎండీ రవూఫ్‌ వివరాల మేరకు.. ఆదివారం రాత్రి తుంకిమెట్ల పెట్రోల్‌బంక్‌ సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో శవాన్ని గుర్తించి కొడంగల్‌ మార్చురీ పంపించామని ఎస్‌ఐ తెలిపారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ధారూరు: ప్రార్థనాలయంలో జరుగుతున్న బాల్యవివాహాన్ని పోలీసులు అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చర్చిలో ఆదివారం మధ్యాహ్నం బాల్య వివాహం జరుగుతుందన్న సమాచారంతో పోలీసులు, చైల్డ్‌లైన్‌ అధికారులు సంయుక్తంగా అక్కడి వెళ్లారు. చర్చి సమీపంలో కర్ణాటక రాష్ట్రం బీదర్‌ జిల్లాకు చెందిన బాలికను వారి బంధువుల కుమారుడైన యువకుడికి ఇచ్చి వివాహం జరపడాన్ని గుర్తించారు. బాల్య వివాహం చేయడం చట్టరీత్యా నేరమని పోలీసులు ఇరు కుటుంబాలకు చెప్పారు. అనంతరం బాలికను చైల్డ్‌లైన్‌ అధికారులకు అప్పగించారు.

పదేళ్లయినా.. పట్టించుకోరా?

- శంకుస్థాపనకే పరిమితమైన ఆదర్శ వసతి గృహం
- ఏటా ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

పెద్దేముల్‌: వసతి గృహం లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి కళాశాలకు చేరుకోవడానికి నరకయాతన అనుభవిస్తున్నారు. మండలంలోని గొట్లపల్లి ఆదర్శ పాఠశాల (మోడల్‌ స్కూల్‌)కు అనుబంధంగా నిర్మిస్తున్న వసతి గృహం పనులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. దాదాపు పదేళ్లు దాటినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వసతి గృహం పనులు ముందుకు సాగడం లేదు. దీంతో పలు గ్రామాల విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పాలకులకు, అధికారులకు ఏటా విన్నవించానా పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ప్రభుత్వం విద్యా బోధనకు పెద్దపీట వేస్తున్నామని చెప్పడం తప్పా క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

పెద్దేముల్‌ మండల గొట్లపల్లి గ్రామ శివారుల్లో 2012లో అప్పటి ప్రభుత్వం సీఎస్‌ఎస్‌ గ్రాంట్‌ కింద రూ.12.8 కోట్లు మంజూరు చేసింది. సుమారు పదేళ్లు దాటిన వసతి గృహం పనులు పూర్తి కాలేదు. దీంతో వసతుల లేమితో విద్యా బోధన అంతంత మాత్రంగానే సాగటంతో ఏటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. త్వరలో వసతి గృహం పనులు పూర్తి చేయాలని మండల సర్వసభ్య సమావేశంలో చర్చించారు. వసతిగృహం పూర్తయితే సుమారు 100 మంది విద్యార్థులకు ఊరట లభిస్తుందని స్థానికులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్‌ పాఠశాలలకు దీటుగా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పటం తప్పా వసతులు కల్పించటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. వసతి గృహం లేక ఏటా ప్రవేశాలకు విద్యార్థులు సక్రమంగా రావటం లేదన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి వెంటనే స్పందించి నిలిచిపోయిన వసతి గృహం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రయోజనం లేదు

గతేడాది వసతి గృహం పనులు ప్రారంభం చేస్తామని చెప్పిన అధికారులు నేటికి ప్రారంభించలేదని, వెంటనే పనులు ప్రారంభించాలని ప్రజాసంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. వసతి గృహం లేకపోవడంతో పాఠశాల వదిలే సమయం, ఉదయం సమయంలో బస్సులు సమయానికి రాక నానా ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. సాయంత్రం సమయంలో బస్సులు నిలపక ఇంటికి వెళ్లటానికి రాత్రి కూడా అవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. 6 నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం వరకు ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేదని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి వసతి గృహం పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రిన్సిపాల్‌ గాయత్రి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



అర్థాంతరంగా నిలిచిన ఆదర్శ పాఠశాల వసతి గృహం భవనం పనులు (ఇన్‌సెట్‌లో) అప్పట్లో వేసిన శిలాఫలకం

అర్ధరాత్రి షాపులో దూరి.. లూటీ చేసి

రూ.5 లక్షల నగదు, తులం బంగారు నాణెం తస్కరించిన దుండగులు



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ మారయ్య

ఇబ్రహీంపట్నం: కిరాణ దుకాణంలో అర్ధరాత్రి దుండగులు చొరబడి రూ.5 లక్షలు నగదు అపహరించుకుపోయిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మంచాల రోడ్డులో శ్రీ బాలాజీ కిరాణ దుకాణాన్ని ఇద్దరు పనివాళ్లను పెట్టుకొని జి.నాగేశ్‌ నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆ షాపుపై ఉన్న ఇంటిలోనే ఆయన నివాసముంటున్నాడు. శనివారం చంపాపేటలో ఉండే నాగేశ్‌ కుమారుని వద్దకు భార్యతో కలిసి దుకాణం మూసివేసిన అనంతరం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దుకాణం వెనుకవైపు ఉన్న తలుపులను పగుల గొట్టి దుండగులు షాపులోకి ప్రవేశించారు. క్యాష్‌ కౌంటర్‌లో ఉన్న రూ.5 లక్షల నగదు, తులం బంగారు నాణెంను తస్కరించారు. షాపులోని వేరే వస్తువులను జోలికి వెళ్లలేదు. ఆదివారం ఉదయం నాగేశ్‌ వచ్చి దుకాణం షట్టర్‌ తీయగా చోరీ జరిగిన విషయాన్ని గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ మారయ్యలు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి వివరాలు తీసుకున్నారు. అక్కడున్న సీసీ పుటేజీలను పరిశీలించారు. ఆ షాపు వెనుకవైపు ఉన్న భవనంపై నుంచి లోపలికి దొంగలు దూరినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. షాపులో పనిచేసే వర్కర్లను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. దుకాణ యాజమాని నాగేశ్‌, అతని భార్య పద్మావతిలు ఇంట్లో లేరనే విషయం తెలిసిన వర్కర్స్‌ ఇతరులకు సమాచారం అందజేసి చోరీకి సహకరించవచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఓట్ల లెక్కకు సర్వం సిద్ధం



పాలమూరు విశ్వ విద్యాలయం

- 14 టేబుళ్లు, 19 రౌండ్లలో షాద్‌నగర్‌ అసెంబ్లీ సెగ్మెంట్‌ కౌంటింగ్‌
- పాలమూరు ఫలితంపై ఉత్కంఠ

షాద్‌నగర్‌: ఎట్టకేలకు పార్లమెంట్‌ ఎన్నికల ప్రక్రియ చివరి ఘట్టానికి చేరుకుంది. అన్ని విడతల్లో పోలింగ్‌ ముగియడంతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ మాత్రమే మిగిలింది. దీంతో ఫలితాలపై అందరిలో ఉత్కంఠ నెలకొంది. అయితే ఓట్ల లెక్కింపు కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం పార్లమెంట్‌ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనుంది.

మహబూబ్‌నగర్‌లో ఓట్ల లెక్కింపు

పార్లమెంట్‌ ఎన్నికల్లో షాద్‌నగర్‌ అసెంబ్లీ నియోజకవర్గం మహబూబ్‌నగర్‌ పరిధిలోని వస్తుంది. అయితే ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే అధికారులు ఈవీఎంలను మహబూబ్‌నగర్‌ జిల్లా కేంద్రంలో బండమీదిపల్లిలో ఉన్న పాలమూరు యూనివర్సిటీలో భద్రపరిచారు. ఓట్ల లెక్కింపును యూనివర్సిటీలోని మొదటి అంతస్థులో ఉన్న ఫార్మాసుటికల్‌ సైన్స్‌ బ్లాక్‌లో లెక్కించనున్నారు. పోస్టల్‌ బ్యాలెట్‌లను గ్రౌండ్‌ ఫ్లోర్‌లో లెక్కిస్తారు.

14 టేబుళ్లు.. 19 రౌండ్లు

షాద్‌నగర్‌ అసెంబ్లీ సెగ్మెంట్‌ పరిధిలో మొత్తం 2,38,478 మంది ఓటర్లు ఉన్నారు. అయితే పార్లమెంట్‌ ఎన్నికల్లో మొత్తం 263 పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 77.42శాతం పోలింగ్‌ నమోదైంది. 1,84,630 మంది ఓటర్ల తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్‌ ఎన్నికల్లో పోలింగ్‌ శాతం స్వల్పంగా తగ్గింది. అయితే ఓట్ల లెక్కింపు కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 14 టేబుళ్ల ఏర్పాటు చేసి.. 19 రౌండ్‌లలో షాద్‌నగర్‌ ఓట్లను లెక్కించనున్నారు. ఒక్కో రౌండ్‌ ఓట్ల లెక్కింపునకు సమారు 15 నిమిషాల సమయం పడుతుంది. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. గంటలకు సుమారు నాలుగు రౌండ్ల ఓట్లు లెక్కింపు జరగనుంది. మధ్యాహ్నం 1 గంట వరకు ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఏర్పాట్లు పూర్తి

షాద్‌నగర్‌ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి ఓట్ల లెక్కింపు మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో ఉన్న ఫార్మాసుటికల్‌ విభాగంలో నిర్వహిస్తున్నాం. ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. అన్ని పార్టీల ఏజెంట్ల ముందు ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ను తెరుస్తాం.

– వెంకటమాధవరావు, ఏఆర్‌ఓ, షాద్‌నగర్‌

ఉరుములతో పలు చోట్ల వర్షం



అనంతగిరిఘాట్‌ రోడ్డులో విరిగిపడిన చెట్టు

అనంతగిరి: వికారాబాద్‌ మున్సిపల్‌, మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. దీంతో వాతావరణమంతా ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ప్రజలు ఎండ ఉక్కపోతతో సేదతీరారు. ఒక్కసారిగా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు బీభత్సం సృష్టించాయి. మండలంలోని జైదుపల్లి గ్రామానికి చెందిన బక్కి రాములుకు చెందిన ఎద్దు పొలం వద్ద ఉండగా ఒక్కసారిగా పిడుగుపడింది. దీంతో అది మృత్యువాత పడింది. దాదాపు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. అనంతగిరి నంది ఘాట్‌ వద్ద రోడ్డు పక్కన ఉన్న చెట్టు ఈదురుగాలులకు ఒక్కసారిగా రోడ్డుపై ఒరిగింది. దీంతో కాసేపు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగింది.



పిడుగుపాటుకు మృతిచెందిన ఎద్దు

ఉత్తమ పోలీసులకు పురస్కారాలు



ఏఎస్‌ఐ సత్యసీలారెడ్డికి పతకాన్ని బహూకరిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

కుల్కచర్ల: ఇద్దరు పోలీసులు కుల్కచర్ల నుంచి జిల్లా స్థాయి ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యారు. ఉత్తమ పోలీసు సేవా పతకం ఎంపికలో భాగంగా ఏఎస్‌ఐ సత్యసీలారెడ్డి, హెడ్‌ కానిస్టేబుల్‌ ఖాజాలు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కోటిరెడ్డి ఇరువురికి ఉత్తమ పురస్కారాలను అందజేశారు. అనంతరం అభినందించారు. కాగా.. కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా సత్యసీలారెడ్డి, హెడ్‌ కానిస్టేబుల్‌గా ఖాజా విధులు నిర్వహిస్తున్నారు.



హెడ్‌ కానిస్టేబుల్‌ ఖాజాకు పతకాన్ని ప్రదానం చేస్తున్న ఎస్పీ

వృథాగా నీరు.. ఆపేదెవరు?

దుద్యాల: ఎండల జోరుకు చాలా ప్రాంతాల్లో బోర్లు అడుగంటిపోతున్నాయి. నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతూ పొదుపుగా వాడుతున్నారు. కానీ ఇక్కడ మాత్రం బోరు నుంచి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఈ సంఘటన దుద్యాల మండల కేంద్రంలో ఆదివారం దర్శనమిచ్చింది.



రైలు ఢీకొని.. వ్యక్తి మృతి

నందిగామ: గుర్తు తెలియని రైలు ఢీకొని.. ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చంద్రాయాన్‌గూడ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ మల్లేశ్వర్‌ కథనం ప్రకారం.. రైల్వే ట్రాక్‌పై వ్యక్తి(40) మృతదేహం పడి ఉందని స్థానికులు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా పసుపు కలర్‌ షార్ట్‌ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్‌ ఆస్పత్రికి తరలించామని వివరించారు. రైలు ఢీకొనడంతో మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు.

కబేళాకు తరలిస్తున్న ఆవుదూడ పట్టివేత

యాచారం: సాగర్‌రోడ్డుపై అక్రమంగా నగరానికి తరలిస్తున్న ఆవుదూడను పోలీసులు పట్టుకున్నారు. నగరానికి చెందిన రబ్బాని నల్గొండ జిల్లా కేంద్రం నుంచి ఆదివారం మధ్యాహ్నం ఓ ప్రైవేట్‌ వాహనంలో దాదాపు రూ.70 వేల విలువ చేసే ఆవుదూడను తరలిస్తున్నాడు. యాచారం-మాల్‌ కేంద్రాల మధ్యన వాహనాల తనిఖీలో కోడెను కబేళాకు తరలిస్తున్నట్లు యాచారం పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆ మూగజీవాన్ని నగరంలోని గోశాలకు తరలించి, రబ్బానిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పిడుగుపాటుకు ఆవు మృత్యువాత



తలకొండపల్లి: ఆవు కళేబరం

తలకొండపల్లి: పిడుగుపాటుకు గురై ఆవు మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని చంద్రధనలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శేఖర్‌ అప్పు చేసి ఇటీవల పాడి ఆవును కొనుగోలు చేశాడు. ఆదివారం ఆవు పొలంలో మేస్తుండగా, ఉరుములు, మెరుపులతో పిడుగు పడింది. దీంతో అది అక్కడికక్కడే మృత్యువాత పడింది. చేసిన అప్పు తీరక ముందే ఆవు మృతి చెందిందని, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

కొబ్బరి చెట్టుపై పడి..

షాబాద్‌: కొబ్బరి చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగిన సంఘటన షాబాద్‌ మండలం మరియాపురంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గాలి, వాన, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో ఆదూరి అగస్టిన్‌రెడ్డి, ఆరోగ్యరెడ్డి ఇంటి పక్కనే ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో మంటలు చెలరేగి చెట్టు పూర్తి ధ్వంసం అయింది.



షాబాద్‌: మరియాపురంలో కొబ్బరి చెట్టుపై పడిన పిడుగు


సాగులో ఆదర్శం

కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అన్నాడో కవి. స్వయం కృషితో ఆ భార్యాభర్తలు వ్యవసాయం వైపు అడుగులు వేశారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగం రాలేదని దిగులు చెందకుండా పొలం బాట పట్టారు. షాబాద్‌ మండలం సర్దార్‌నగర్‌ గ్రామానికి దాదె అమృత్‌రాజ్‌, స్వప్న దంపతులు వివిధ పంటలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

- వినూత్న ఒరవడితో వ్యవసాయం
- సొంత మార్కెట్‌తో లాభాలు పొందుతున్న దంపతులు



బీర తోటలో అమృత్‌రాజ్‌, స్వప్న దంపతులు



నర్సరీలో పెంచుతున్న నారు

షాబాద్‌: మండల పరిధిలోని సర్దార్‌నగర్‌ గ్రామానికి చెందిన దంపతులు దాదె అమృత్‌రాజ్‌, స్వప్న బీఏ, బీఈడీ, ఎంఏ పూర్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. కానీ ఫలితం రాకపోవడంతో వ్యవసాయ రంగం వైపు దృష్టి సారించారు. సంప్రదాయ పంటలైన పత్తి, మిర్చి, మొక్కజొన్న, వరి సాగు వైపు కాకుండా వినూత్న ఆలోచన చేశారు. తనకు ఉన్న వ్యవసాయ పొలంలో వివిధ రకాల పంటలు పండిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. పొలంలోనే పూల మొక్కల నర్సరీ ఏర్పాటు చేశారు. పాలీహౌస్‌ ద్వారా నర్సరీల్లో పెంచిన పూల మొక్కలను మార్కెట్‌ ధర కంటే తక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. నెలకు రూ.2లక్షల ఆదాయం పొందుతున్నారు. అమృత్‌ రాజ్‌, స్వప్న దంపతులు స్వయం ఉపాధితో ముందుకు సాగాలని ఎనిమిదేళ్ల క్రితం గ్రామంలోని తమ వ్యవసాయ పొలంలో 2 ఎకరాలలో రూ.15 లక్షలతో పూల మొక్కల నర్సరీ ఏర్పాటు చేశారు. అందులో గులాబీ, చామంతి, బంతి నారు పెంచుతున్నారు. మార్కెట్‌లో గులాబీ నారు మొక్కలు రూ. 20వరకు విక్రయిస్తుండగా ఇక్కడ మాత్రం రూ.12-15 వరకు అందిస్తున్నారు. చామంతి నారు సైతం రూ1.50 నుంచి రూ.2 వరకు విక్రయిస్తున్నారు.

నాణ్యమైన నారు సరఫరా

ఒక రైతుగా స్వయంగా ఇక్కడే విత్తనాలు పోసి నారు పెంచడంతో నమ్మకాన్ని చూరగొన్నారు. ఫోన్‌ల ద్వారా నారు బుకింగ్‌ చేసుకుని తీసుకు వెళ్తుంటా రు. దాదాపు తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి రైతులు ఇక్కడికి వచ్చి నారు తీసుకుపోతారు. విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం, కడప ప్రాంతాలకు కూడా నారు సరఫరా అవుతుంది. ఇతర ప్రాంతాల నుంచి ట్రాన్స్‌పోర్టులో వచ్చే నారుకంటే ఈ నారుతో మంచి దిగుబడులు వస్తాయని రైతులు సైతం చెబుతున్నారు. వ్యవసాయంలో ఉన్న లాభాలు వేరే ఎక్కడా లేదని వారు అంటున్నారు. తమిళనాడు, కృష్ణగిరి నుంచి గులాబీ నారు విత్తనాలు సెంట్‌బుల్లెట్‌, కస్టార్‌, ఎల్లో ఆరెంజ్‌ రకాలు తీసుకువచ్చి ఇక్కడ నర్సరీలో పెంచుతారు.

నిత్యం 30 మందికి ఉపాధి

అమృత్‌ రాజు, స్వప్న భార్యభర్తలతో పాటు గ్రామానికి చెందిన మరో 25-30 మంది రోజు నర్సరీల్లో పనులు చేస్తున్నారు. ట్రేలలో ఎరువులు నింపడం, విత్తనాలు వేయడం, నారు మొక్కలు పెట్టడం, రైతులకు నారు తీసి అందించడం వంటి పనులు చేస్తుంటారు. కూలీలకు రోజుకు రూ.500 వరకు ఇస్తున్నారు. వారితో పాటు భార్యాభర్తలు కూడా నారుకు నీరు పట్టడం, ఎరువులు చల్లడం వంటి పనులు చేస్తూ ఇక్కడే ఉంటారు. సాగుపై వారి అభిప్రాయాలు చూద్దాం.

- కర్రల సాగుతో 8 ఎకరాలలో తీగజాతి బీర పంటను సాగు చేశారు. రోజుకు రెండున్నర క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రతి రోజూ చేవెళ్ల, షాద్‌నగర్‌, శంషాబాద్‌ మార్కెట్‌కు తీసుకెళ్తున్నారు. మూడు రోజులకు ఒకసారి మందుల పిచికారీ చేస్తాం. క్వింటాలుకు రూ.3,500 నుంచి 4 వేల వరకు వస్తుంది. ఖర్చులు పోను రూ.12లక్షల ఆదాయం వచ్చింది.
- ఒక ఎకరాలో క్యాప్సికం పంట సాగు చేశాను. ప్రస్తుతం పూత, పిందే దశలో ఉంది. ఇప్పటి వరకు రూ.2 లక్షల ఖర్చు వచ్చింది. ఖర్చులు పోను రూ. 3లక్షల వరకు ఆదాయం వస్తుంది. గతంలో ఈ పంటను సాగు చేస్తే మంచి దిగుబడి వచ్చింది.

కూరగాయలతో లాభాలు

టమాట, బీర, కాకర, బెంట, వంకాయ తోటలు వేశాం. నీటి కొరత వల్ల డ్రిప్‌, మల్చింగ్‌ పద్ధతుల్లో సాగు చేస్తున్నాం. గతంలో ఉద్యానవన శాఖ ద్వారా సబ్సిడీపై కూరగాయల విత్తనాలు ఇచ్చేది. ప్రస్తుతం వాటిని ఇవ్వడం మానేశారు. దీంతో వేలాది రూపాయలు వెచ్చించి విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సబ్సిడీ విత్తనాలు ఇచ్చి ఆదుకోవాలి.

– అమృత్‌రాజు, స్వప్న దంపతులు